క్లుప్తంగా

ఆర్టీసీలో కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ కార్మికులు

జగిత్యాలటౌన్: భారత రాజ్యాంగం ప్రకారం ఏర్పడి కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి, ప్రజాస్వామ్యయుతంగా కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ కార్మికులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్మిక సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని 5, 6 వార్డుల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు వల్లకొండ మహేశ్ గౌడ్, అన్వరిబేగం పాల్గొన్నారు.

హరితహారం విజయవంతం చేయాలి



మొక్క నాటుతున్న జెడ్పీటీసీ

పెగడపల్లి: తెలంగాణ హరితహారం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ రాజేందర్‌రావు అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ రహదారి డివైడర్‌పై బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జీపీ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు, విండో డైరెక్టర్ ప్రవీణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, స్వామి లక్ష్మీనారాయణ, శాంతపురావు పాల్గొన్నారు.


ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న విజయ్‌కుమార్

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్ ఏ.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, జాగ్రత్తలు, పొదుపు, దాని ప్రయోజనాలు, బ్యాంకుల లావాదేవీలు , బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ప్రిన్సిపాల్ సుమలత, ఉప సర్పంచ్ సంకె రాకేశ్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

'ఈటల'ను కలిసిన సురభి నవీన్



కోరుట్ల: బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఈటలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రమాదకర మూలమలుపులు



కథలాపూర్ శివారులో మూలమలుపు



మేడిపెల్లి శివారులో ప్రమాదాలకు కేంద్రమైన మూలమలుపు... చెట్టు ఇదే

కథలాపూర్: మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో ప్రధాన రోడ్లపై మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం ప్రమాదాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోరుట్ల– జగిత్యాల ప్రధానరోడ్డుపై మేడిపెల్లి మండల కేంద్రం శివారులో మోహన్‌రావుపేట రూట్‌లో మూలమలుపు వద్ద చెట్టుకు లారీలు, కార్లు ఢీకొట్టుకున్న సంఘటనలు ఎక్కువగా జరిగాయని స్థానికులు తెలిపారు. గత నెల 30 న ఇదే మూలమలుపు వద్ద లారీ చెట్టుకు ఢీకొట్టడంతో క్యాబిన్‌లో లారీ డ్రైవర్, క్లీనర్ ఇరుక్కుపోగా.. గంటలతరబడి శ్రమించి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో క్లీనర్ మృతిచెందారు. మరోవైపు కోరుట్ల– వేములవాడ ప్రధానరోడ్డుపై కథలాపూర్ శివారులో దుంపేట రూట్‌లో మూలమలుపు వద్ద రోడ్డు వంగినట్లుగా ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఎక్కువగా జరిగాయి. ఇక్కడ ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొనగా యువకుడు మృతిచెందాడు. ఇదే మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. ఇప్పపెల్లి శివారులో మూలమలుపు వద్ద ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. ఈ మలుపు వద్ద బైక్‌లపై వెళ్లేవారు అదుపుతప్పి పడిపోయిన సందర్భాలున్నాయని ఆయా గ్రామస్తులు తెలిపారు. రోడ్ల భవనాల శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన మూలమలుపు వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డుకి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కథలాపూర్, మేడిపెల్లి మండలాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం మైతాపూర్‌లో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, రూ.25 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ చాలని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం పట్ల రైతులపై ఏలాంటి చిత్తశుద్ధి ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా లక్షలాది ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుందని గుర్తుచేశారు. అనంతరం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ అజారొద్దీన్, ఎంపీటీసీ రాజనాల మధు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, కో–ఆప్షన్ సభ్యుడు ముకీద్, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల: పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం టీఆర్‌నగర్‌లో చేపడుతున్న సీసీరోడ్ల అభివృద్ధిని పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులు నాణ్యతతో జరుగుతున్నాయన్నారు. అలాగే టీఆర్ నగర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ చాంద్‌పాషా, డీఈ రాజేశ్వర్, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన వార్డు మన ఎమ్మెల్యే

మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా 6,7 వార్డుల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పర్యటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వార్డులను అభివృద్ధి చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలలోని 6వ వార్డుకు చెందిన చింత రాజు వెన్నుముక వ్యాధితో బాధపడుతుండగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం రూ.1.50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ బుధవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రం, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గ కేంద్రాలు, మెట్‌పల్లి, కథలాపూర్,వెల్గటూర్, మేడిపల్లి, గొల్లపలి, కొండగట్టు, కొడిమ్యాల, బుగ్గారం, రాయికల్,పెగడపల్లి, సారంగాపూర్, మల్యాల, ఇబ్రహీంపట్నం మండలాలు, పలు గ్రామాల్లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు,ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



కథలాపూర్‌లో రేవంత్ దిష్టిబొమ్మకు శవయాత్ర



రాయికల్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసనలు





గొల్లపల్లిలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు, సారంగాపూర్‌లో నిరసన

మెట్‌పల్లి/కథలాపూర్/రాయికల్/పెగడపల్లి/మల్యాల/కొండగట్టు/కోరుట్ల/బుగ్గారం/సారంగాపూర్/మల్లాపూర్/గొల్లపల్లి: ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా వ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేపట్టారు. పలుచోట్ల సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదని సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారు. మెట్‌పల్లి, మేడిపెల్లి, బీమారం, రాయికల్, కోరుట్ల,కోడిమ్యాల, బుగ్గారం ,సారంగాపూర్, బీర్‌పూర్, పెగడపల్లి,మల్యాల, మల్లాపూర్, గొల్లపల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు,ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన



మల్లాపూర్‌లో జీపీ కార్మికుల నిరసన

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు.

రాయికల్: పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ప్రశాంత్, మహిపాల్, రాజేందర్, రమేశ్, జలేందర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. అలాగే వేతనాల పెంపు విషయంలోను నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. కార్యక్రమంలో అందె మారుతి, గంగోని క్రాంతి, తుమ్మనపల్లి రాంప్రసాద్, గోరుమంతుల ప్రవీణ్ తదితరులున్నారు.

మల్లాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు రేగుంట ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి గడచంద శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారి ముద్దం శ్రవణ్, నాయకులు గొర్రె రాంబాబు, తోట్ల శ్రీనివాస్, మర్రిపెల్లి నరేష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం సారంగాపూర్ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అర్ధనగ్న ప్రదర్శన చేసారు. రెండు మండలాల్లో వివిధ పార్టీ నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు.

గొల్లపల్లి: ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, నాయకులు మద్దతు తెలిపారు.

మల్యాల: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్ష బుధవారం నాటికి ఏడో రోజుకు చేరింది. దీక్షా శిబిరంలో పంచాయతీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు వేడుకున్నారు.

సంఘ భవనం కోసం స్థలం కేటాయించాలని వినతి

మల్యాల: మండల పద్మశాలీ సేవా సంఘం భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ మండల పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ మిట్టపల్లి విమల, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం భవనం కోసం 10 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కస్తూరి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శశాంక్, కోశాధికారి బొమ్మకంటి గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెంట సుధాకర్, నాయకులు కొండబత్తిని నర్సయ్య, బాలె నవీన్, కట్కం మహేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై నాయకులకు అవగాహన

మల్యాల: ఎన్నికల సంఘం నూతన నిబంధనలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు బుధవారం మండల తహసీల్దార్ సుజాత అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 53 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, రాబోయే ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. మల్యాల, మ్యాడంపల్లి, పోతారం, లంబాడిపల్లి,నూకపల్లి, గుడిపేట గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా అన్ని వసతులు ఉన్న గదులను గుర్తించి, ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం, టీడీపీ మండలాధ్యక్షుడు రామగిరి మునీందర్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని వినతి

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి ప్రతిమ ఆస్పత్రి డాక్టర్లు చెన్నమనేని వికాశ్, దీపలకు వినతిపత్రం అందించారు. గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడంలేదని, గ్రామస్తులకు శుద్ధమైన నీరు అందించడానికి ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరామని, 15 రోజుల్లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

డ్రమ్‌సీడర్ పద్ధతితో తగ్గనున్న పెట్టుబడి



సాగు పరిశీలిస్తున్న ఏఈవో,నాయకులు, రైతులు

మల్లాపూర్: డ్రమ్‌సీడర్‌తో పంట సాగు చేస్తే రైతులకు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి సాయిప్రియ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం బద్దం రాజేశ్ అనే రైతు పొలంలో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగును ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు రైతులు సాధారణ పద్ధతిలో సాగు చేయడం ద్వారా పెట్టుబడి అధికమవడంతో పాటు దిగుబడి తక్కువ అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి, సొసైటీ చైర్మన్ నెరెళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, రైతులు రవి, బొర్రన్న పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: డ్రమ్‌సీడర్‌తో వరిపంట సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని ఏఈవో వరుణ్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో డ్రమ్ సీడర్ విధానం ద్వారా ఐదెకరాల వరిసాగును చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు డ్రమ్ సీడర్‌తో వరిసాగు చేస్తే కూలీలు తగ్గడంతో పాటు, పంట దిగుబడి పెరుగుతుందని, రైతులు డ్రమ్ సీడర్ విధానంతో వరి సాగు చేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

షాదీఖానా పనులు పూర్తి చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ర్మిస్తున్న షాదీఖానా పనులు వెంటనే పూర్తి చేయాలని మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం మైనార్టీ నాయకులతో కలిసి ఆయన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులను ప్రారంభించి ఏడు నెలలు గడిచినప్పటికీ ఇంకా వాటిని పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో రెహమాన్, నయూం, ఫిరోజ్, ముఖీం, మదర్, రహీముద్దీన్, సాదక్ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ బుధవారం తెలిపారు. జూన్ 18, 2023 వరకు పట్టాపాస్‌బుక్‌లు పొందిన రైతులు 18 నుంచి 59 ఏళ్ల లోపు రైతులు ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాధితకుటుంబానికి ఆర్థికసాయం

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతిచెందగా, పలువురు నాయకులు, మిత్రులు కలిసి రూ. 53 వేలు సమకూర్చి బుధవారం బాధిత కుటుంబానికి బుధవారం ఇచ్చారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ అధికారి మహేశ్ అన్నారు. మండలంలోని సాతారంలో బుధవారం నిర్వహించిన టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్టీసీ సేవలపై ప్రయాణికులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సుబుకింగ్‌కు సెల్ నంబర్ 9959225927, 7382851039లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ధర్మపురి: 2013 నుంచి 2018 వరకు ధర్మపురి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు లక్షలాది నిధులు దుర్వినియోగం అయ్యాయని అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సయ్యద్ అజ్మత్ అలీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి ఉప సర్పంచ్ ఇందారపు రామయ్య, వార్డు సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా కోట్లాది రూ.లు ఖర్చు చేశారని అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపాడు. కానీ అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఇబ్రహీంపట్నం నాకు తల్లి లాంటిది



ఆర్డీవో మహేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలం నాకు తల్లిలాంటిది అని, 12 నెలలుగా తహసీల్దార్‌గా ఇక్కడ పనిచేసి ఆర్డీవోగా పదోన్నతి పొందడం సంతోషంగా ఉందని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, పలువురు నాయకులు, ఐకేపీ సిబ్బంది ఆర్డీవో మహేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌గా ఒక ప్రణాళికాబద్ధంగా పనిచేసి, తోటి ఉద్యోగులకు సూచనలు, సలహాలు ఇస్తూ పెండింగ్ పనులు లేకుండా పనిచేసి గుర్తింపు పొందానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ తిమ్మని రాములు, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఏపీఎం శంకర్, సీసీ సురేఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రకు సంపూర్ణ మద్దతు

జగిత్యాల: సీపీఎస్ విధానం రద్దు చేసేంత వరకు సంపూర్ణ మద్దతు కొనసాగిస్తామని టీఎన్జీవో నాయకులు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ ఉపాధ్యాయులందరూ యాత్రకు మద్దతు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, కార్యదర్శి నగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 మంది బైండోవర్

కథలాపూర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో అల్లర్లు జరగకుండా పోలీస్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాల వారీగా రికార్డులను పరిశీలించి వివిధ కేసుల్లో ఉన్నవారి గురించి ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పెగ్గెర్ల గ్రామానికి చెందిన ఆరుగురు, కథలాపూర్‌కు చెందిన నలుగురు యువకులను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. వీరిని వ్యక్తిగత పూచికత్తుపై వదిలేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా మడలేశ్వర స్వామి బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

పెగడపల్లి: మండల కేంద్రంలో రజకులు బుధవారం మడలేశ్వర స్వామి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి వద్ద తయారు చేసిన బోనాలతో డిజె పాటలు, డప్పు చప్పుళ్లతో పుర వీధుల మీదుగా ర్యాలీగా ఆలయానికి చేరుకుని స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా ఆషాఢమాస బోనాలు

కోరుట్ల: పట్టణంలో ఆషాఢ మాస బోనాల జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆచార్యులు బోనాలను ఊరేగింపుగా తీసుక వెళ్లి పట్టణ శివారులోని మహాలక్ష్మీ, పోచమ్మ తల్లి దేవతలకు నైవేద్యంగా సమర్పించారు.